# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 81 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

21-01-2026 బుధవారం వెల : 1 /- పేజీలు : 4


### చిక్కోల్ వాసుల చిరకాల ఆకాంక్షపై స్పందించని పాలకులు

## శ్రీకాకుళం నగరానికి రైల్వే స్టేషన్ కలేనా?




**నవతరం -శ్రీకాకుళం**

జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం నగరానికి ఇప్పటికీ సొంత రైల్వే స్టేషన్ లేకపోవడం జిల్లా ప్రజల పట్ల పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. నగరానికి సుమారు 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆమదాలవలస (శ్రీకాకుళం రోడ్) స్టేషన్?పై ఆధారపడాల్సి రావడం వల్ల ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అక్కడ సరైన సిటీ బస్సు సౌకర్యం కూడా లేదు. పోనీ ఆటోపై రావాలంటే రైలు టికెట్ ధర కంటే ఆటో చార్జీలే ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా తెల్లవారుజామున దిగే ప్రయాణికుల నుంచి ఆటో డ్రైవర్లు అధిక రేటులను వసూళ్లకుచేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. పోనీ ట్రావెల్ బస్సును ఆశ్రయిస్తే, అంతే సంగతులు. ఆ బస్సుల్లో 90 శాతం బస్సులు ఎక్కడికక్కడే బ్రెక్ డౌన్ అవుతూ, ప్రయాణీకులను తీవ్ర నరకాన్ని చూపిస్తున్నాయి. అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కాలం చెల్లిన బస్సులు నడుపుతూ, అధిక ధరలు వసూలు చేస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. శ్రీకాకుళం జిల్లా నుంచి విడిపోయినా విజయనగరం జిల్లా ప్రదాన కేంద్రంలో రైల్వే స్టేషన్ ఉండటం కారణంగా బాగా అభివృద్ధి చెందింది. తాజాగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కూడా సిద్ధమవుతుండటంతో అక్కడ అభివృద్ధి పరుగులు పెడుతూంది. మౌలిక వసతులు కూడా బాగా పెరిగాయి. మూడు రింగు రోడ్లు వచ్చాయి. కానీ శ్రీకాకుళం నగరం మాత్రం రవాణా పరంగా దశాబ్దాలుగా వెనుకబడే ఉంది. ఒక్క రింగు రోడ్డు కూడా లేకపోవడంతో ఇక్కడ ఇరుకు రోడ్లు ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

డిమాండ్లు:

1. నగరానికి రైల్వే లైన్: రైల్వే లైన్ ను కనీసం శ్రీకాకుళం కొత్తరోడ్డు వరకైనా పొడిగించి, అక్కడ ఒక టెర్మినల్ స్టేషన్ ఏర్పాటు చేయాలి.
2. పేదలకు ఊరట: అధిక శాతం పేదలు, మధ్యతరగతి ప్రజలు రైలు ప్రయాణంపైనే ఆధారపడతారు కాబట్టి, వారి ఆర్థిక భారాన్ని తగ్గించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.
3. ప్రజాప్రతినిధుల చొరవ: చిక్కోల్ ప్రజల ఈ చిరకాల వాంఛను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి, తక్షణమే రైల్వే స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలి.

శ్రీకాకుళం జిల్లా అభివృద్ధిలో రవాణా వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. ఇప్పటికైనా పాలకులు, ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా స్పందించి నగరానికి రైల్వే స్టేషన్ వచ్చేలా చూడాలని శ్రీకాకుళం జిల్లా ప్రజా సమస్యల అధ్యక్షులు బెవర వెంకట రవిశంకర్ డిమాండ్ చేశారు.

## కలెక్టర్ గణితం.. విద్యార్థుల సంతోషం!

- బలగ మున్సిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా మారిన జిల్లా కలెక్టర్
- గణితంలో మెళకువలు నేర్పిన జిల్లా అధిపతి
- పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం.. ఐఏఎస్ ప్రస్థానంపై స్ఫూర్తి



**నవతరం -శ్రీకాకుళం**

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఉదయం విద్యార్థిగా మారిపోయారు. బలగలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన, పదో తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. ముఖ్యంగా 'రైజింగ్ స్టార్స్', 'స్కై స్టార్స్' గ్రూపులకు చెందిన విద్యార్థులతో సుమారు గంటకు పైగా ఇంటరాక్ట్ అయ్యారు.

### లెక్కల మాస్టారిగా కలెక్టర్..

స్వతహాగా గణిత విద్యార్థి అయిన కలెక్టర్, కాసేపు ఉపాధ్యాయుడి అవతారమెత్తారు. కఠినమైన లెక్కలను సైతం సులువుగా ఎలా పరిష్కరించాలో విద్యార్థులకు బ్లాక్ బోర్డుపై చేసి చూపించారు. గణితంలో ఉన్న కిటుకులను వివరిస్తుంటే విద్యార్థులు ఆసక్తిగా విన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు సందేహాలను ఆయన ఓపికగా నివృత్తి చేశారు.

### లక్ష్యం ఉంటే ఏదైనా సాధ్యమే..

"భవిష్యత్తులో మీరు ఏమవ్వాలనుకుంటున్నారు?" అని కలెక్టర్ ప్రశ్నించగా, విద్యార్థుల నుంచి ఉత్సాహభరిత సమాధానాలు వచ్చాయి. ఈ సందర్భంగా ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ తో పాటు వృత్తి విద్యా కోర్సులపై ఆయన దిశానిర్దేశం చేశారు. "మీరు కలెక్టర్ ఎలా అయ్యారు?" అని ఓ విద్యార్థి అడగగా.. తన బాల్యం, ఐఐటీ గౌహతిలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. "తొలుత ఐపీఎస్?కు ఎంపికైనా, పట్టు వదలకుండా శ్రమించి ఐఏఎస్ సాధించాను. నాకు ఇష్టమైన గణితం, ఫిజిక్స్ సబ్జెక్టులే నా విజయానికి తోడ్పడ్డాయి" అని వివరించి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు.

### రుచికరమైన భోజనం..

మధ్యాహ్న సమయం కావడంతో కలెక్టర్ విద్యార్థులతో కలిసే కూర్చుని 'డొక్కా సీతమ్మ' మధ్యాహ్న భోజనాన్ని ఆరగించారు. భోజనం రుచిగా ఉందా? మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా? అని విద్యార్థులను ఆరా తీశారు. పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా, చదువుకోవడానికి అనువైన వాతావరణంతో ఉండటంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ పాఠశాల సిబ్బందిని అభినందించారు.

### ఆదర్శం: తన ప్లేటు తానే కడిగిన కలెక్టర్!

మధ్యాహ్న భోజనం ముగిసిన తర్వాత కలెక్టర్ స్వప్నిల్ దినకర్ అందరినీ ఆశ్చర్యపరిచారు. భోజనం చేసిన ప్లేటును అక్కడి సిబ్బందికి ఇవ్వకుండా, స్వయంగా తానే ట్యాప్ వద్దకు వెళ్లి శుభ్రం చేసుకున్నారు. "మనం చేసే పనిలో ఏదీ తక్కువ కాదు.. క్రమశిక్షణ, సొంత పనులు చేసుకోవడం అనేవి విద్యార్థి దశ నుంచే అలవడాలి" అని ఈ చేత ద్వారా ఆయన నిరూపించారు. కలెక్టర్ నిరాడంబరతను చూసి విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందనలతో ముంచెత్తారు.

## కేంద్ర ఆర్థిక శాఖ హిందీ సలహా మండలి సమావేశం

- హిందీ అమలుకు కృషి: ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి
- ఖాళీ హిందీ పోస్టులు భర్తీ చేయాల్సిందే: పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్
- సభ్యుల సూచనలు అమలు చేస్తాం: అదనపు కార్యదర్శి బి.ఎన్.మిశ్రా
- హిందీ పోస్టుల కేడర్ రిస్ట్రక్చర్; ఎంపీ భర్తృహరి
- ఈ-జర్నల్ ప్రారంభించండి: కోనే శ్రీధర్
- హిందీ ప్రచార సభ హైదరాబాద్ తరపున మంత్రికి సత్కారం
- హిందీ ప్రచార సభ హైదరాబాద్ క్యాలెండర్ పంపిణీ





**ఏపీ న్యూస్ - న్యూఢిల్లీ:**

కేంద్ర ఆర్థిక శాఖ హిందీ సలహా మండలి సమావేశం ఆదివారం నూతన పార్లమెంట్ భవనంలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి మాట్లాడుతూ, ఆర్థిక శాఖకు సంబంధించి రెవెన్యూ విభాగం, వ్యయ విభాగం, పెట్టుబడుల విభాగం, కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విభాగాల్లో అధికార భాషగా హిందీ అమలను సమర్ధవంతంగా అమలు చేస్తామని తెలిపారు. ఆర్థిక మంత్రిత్వ శాఖలో అధికార భాషగా హిందీ అమలను వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. సభ్యులు ఇచ్చిన సూచనలను అన్నింటిని పాటిస్తామని మంత్రి సభ్యులకు తెలిపారు. సలహా మండలి సభ్యులు, మాజీ రాజ్యసభ సభ్యులు, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ, కేంద్ర ఆర్థికశాఖ పరిధిలోని నాలుగు విభాగాల్లో ఖాళీగా ఉన్న హిందీ విభాగ పోస్టుల భర్తీని ఎందుకు నేటివరకు చేపట్టలేదని ప్రశ్నించారు. భర్తీ కాకపోవడానికి గల కారణాలను వివరించాలని కోరారు. తక్షణమే హిందీ విభాగ ఖాళీ పోస్టుల భర్తీని పూర్తి చేయాలని లక్ష్మీప్రసాద్ అధికారులను కోరారు. కేంద్ర ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి దివాకర్ నాథ్ మిశ్రా మాట్లాడుతూ, సభ్యులు చెప్పిన సూచనలు అన్నిటిని రాసుకున్నామని, వీలు వెంబడి అన్నింటినీ అమలు చేస్తామని తెలిపారు. ఆర్థికశాఖ పరిధిలోని అన్ని విభాగాల్లో ఖాళీగా ఉన్న హిందీ పోస్టుల భర్తీ ప్రారంభమైందని మిశ్రా సభ్యులకు తెలిపారు. సలహా మండలి సభ్యులు, హిందీ ప్రచార సభ హైదరాబాద్ ప్రతినిధి కోనే శ్రీధర్ మాట్లాడుతూ, ఆర్థిక శాఖ పరిధిలోని నాలుగు విభాగాలకు కలిపి రెవెన్యూ విభాగం ద్వారా ఈ జర్నల్ (ఎలక్ట్రానిక్ సాహిత్య పత్రిక)ను ప్రారంభించాలని కోరారు. ఏ, బి, సి కేటగిరీల వారిగా ఆర్థికశాఖ పరిధిలో దేశవ్యాప్తంగా ఉన్న కార్యాలయాల్లో అధికార భాషగా హిందీ అమలు శాతానికి సంబంధించిన వివరాలు సభ్యులకి తెలపాలని కోరారు.

సమావేశాన్ని ఆర్థిక శాఖ హిందీ విభాగ ఉప సంచాలకురాలు శ్రీమతి సుధా వర్మ సమన్వయం చేశారు. అనంతరం హిందీ కవి కటారియా రాసిన " ప్రేరణ మార్గం పంకజ్ చౌదరి " అనే పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. హిందీ ప్రచార సభ హైదరాబాద్ తరుపున సలహా మండలి సభ్యులు కోనే శ్రీధర్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ లు మంత్రి పంకజ్ చౌదరి ను శాలువా కప్పి జ్ఞాపిక, పుష్పగుచ్ఛములతో ఘనంగా సత్కరించారు. హిందీ ప్రచార సభ హైదరాబాద్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను కేంద్ర ప్రభుత్వ రాజభాష విభాగ ఉపసంచాలకులు రఘువీర్ శర్మ, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ లు ఆవిష్కరించి సభ్యులకు పంపిణీ చేశారు. సలహా మండలి సభ్యులు, పార్లమెంట్ సభ్యులు ఎం. భర్తృహరి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అన్ని మంత్రిత్వ శాఖలో హిందీ విభాగ పోస్టుల కేడర్ ను రేస్ట్రక్చర్ చేయనున్నమని తెలిపారు. సాధ్యమైనంత తక్కువ వ్యవధిలో అన్ని మంత్రిత్వ శాఖల్లో అధికార భాషగా హిందీ అమలను శతశాతం పూర్తిచేయాలని లక్ష్యంతో ఉన్నామని ఆయన సభ్యులకు వివరించారు. సమావేశంలో ఆర్థిక శాఖ హిందీ విభాగ -మిగతా 2లో



### శ్రీ విజయ వేంకటేశ్వర స్వామి ఆలయంలో

## చోరీ కేసు ఛేదన

- సుమారు రూ.40 లక్షల విలువైన కేసు ప్రాపర్టీ పూర్తిస్థాయిలో రికవరీ
- నేరం జరిగిన వారం రోజుల్లోనే 5 మంది నిందితుల అరెస్ట్
- కేసు వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్



**నవతరం -శ్రీకాకుళం**

పలాస లోని శ్రీ విజయ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయం (చిన్న తిరుపతి), కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసులో చోరీకి గురైన సుమారు రూ. 40.25 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు మరియు హుండీలోని నగదును పూర్తిస్థాయిలో రికవరీ చేసి, నిందితులను కాశీబుగ్గ పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో వెల్లడించారు.కేసు దర్యాప్తులో భాగంగా కాశీబుగ్గ పోలీస్ స్టేషన్, నరసన్నపేట -మిగతా 3లో

ఎడిటోరియల్

# రాష్ట్రాలపై 'ఆర్థిక' దాడి

బలమైన రాష్ట్రాలే కేంద్రాన్ని బలంగా నిలబెడతాయి.
స్థిరమైన ఆర్థిక వనరులతోనే రాష్ట్రాలు బలంగా నిలుస్తాయి. సమాఖ్య వ్యవస్థ పురోగతికి అత్యంత కీలకమైన ఈ అంశంపైనే నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర బీజేపీ ప్రభుత్వం దాడి చేస్తోంది. ఆర్థిక హక్కులను క్రమేణా హరిస్తోంది. ఫలితంగా రాష్ట్రాలు ప్రతి చిన్న అవసరానికి కేంద్రం దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. మరికొద్ది రోజుల్లో పార్లమెంటు బడ్జెట్? సమావేశాలు జరగనుండగా, దానికి సన్నాహంగా ఇటీవల నిర్వహించిన ప్రీ బడ్జెట్? సమావేశంలో రాష్ట్రాల ఈ దైన్యస్థితి స్పష్టంగా వెలుగులోకి వచ్చింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్? అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్రంలో ఎన్డీయే కూటమికి చెందిన పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు సైతం నిధుల కోసం గళం విప్పాల్సి రావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తమ తమ రాష్ట్రాల్లో నెలకొన్న దుర్భర పరిస్థితులను వివరిస్తూ అదనపు నిధులు కావాలని, జీఎస్టీ పరిహారం కొనసాగించాలని సమావేశంలోనే ఆ రాష్ట్ర ప్రభుత్వాలూ విజ్ఞప్తులు చేశాయి. పన్నుల వసూళ్లలో రాష్ట్రాల వాటా తగ్గిస్తూ, గ్రాంట్లు ఆలస్యం చేస్తూ, అప్పుల పరిమితులను కట్టడి చేస్తూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరే రాష్ట్రాల ఈ దుస్థితికి కారణం.
ప్రీ బడ్జెట్? సమావేశంలో రాష్ట్రం తరపున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయహోదా ఇవ్వాలని కోరారు. హైదరాబాద్? మెట్రో రైల్? ఫేజ్?-2, ప్రాంతీయ రింగ్?రోడ్? (త్రిపుల్? ఆర్?) వంటికి మౌలిక ఇన్?ఫ్రాస్టక్చర్? ప్రాజెక్టులకు త్వరితగతిన అనుమతులు, నిధులివ్వాలని కోరారు. రాష్ట్ర శిక్షణ, ఆరోగ్య రంగాల కోసం ఎఫ్?ఆర్?బిఎం పరిమితులతో మినహాయింపులు, కేంద్ర,రాష్ట్రాల ఆర్థిక భాగస్వామ్యంలో బాగా పరిగణించబడే పన్నుల పంపిణీ, సర్?ఛార్జీల పునర్?నిర్ణయం గురించి సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన మంత్రి హోదాలో నరేంద్రమోడీ పలుమార్లు వచ్చినప్పటికీ తెలంగాణకు సంబంధించిన అనేక విషయాల్లో ఆర్థిక పరిమితులనే విధించారు. ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి కూడా ఢిల్లీ వెళ్లి రాష్ట్రానికి రావాల్సిన నిధుల వాటా, ఆర్థిక సాయంపై ప్రధానికి విన్నవించారు. ఎన్డీయేలో కీలక భాగస్వామి అయిన ఏపీ కూడా విభజన హామీల్లో భాగమైన పోలవరం ప్రాజెక్టుకు పూర్తి నిధులివ్వాలని, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. తెలుగ రాష్ట్రాలే కాదు, ఎన్డీయేలో మరో భాగస్వామి అయిన బీహార్? ప్రభుత్వం నుండి కూడా ఇటువంటి వినతులే అందాయి. పలు బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా జీఎస్టీ నష్టపరిహారం, గ్రాంట్ల పెంపు, ప్రత్యేక ప్యాకేజీల కోసం కేంద్రాన్ని కోరినట్లు వార్తలొచ్చాయి.
సీపీఐ(ఎం) నేతృత్వంలో ఎల్?డిఎఫ్? ప్రభుత్వం అధికారంలో ఉన్న కేరళ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం మరింత కక్షపూరితంగా వ్యవహరి స్తోంది. ఆర్థికంగా దిగ్బంధించడం ద్వారా వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వ ప్రతిష్టను ప్రజల్లో దిగజార్చే కుటిల వ్యూహానికి బీజేపీ తెగ బడుతోంది. ఇలా దాదాపు లక్ష కోట్ల రూపాయల మేర ఆ రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేంద్రం మంజూరు చేయడానికి నిరాకరిస్తోంది. గత ఐదేళ్లలోనే 57వేల కోట్ల రూపాయలకు కోత పెట్టింది. పన్నుల వాటాను 3.89 శాతం నుండి 1.92 శాతానికి తగ్గించింది. ఈ చర్య వల్ల 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే కేరళ ప్రజలు 27 వేల కోట్ల రూపాయలు నష్టపోయారు.
జీఎస్టీ సంస్క రణల ద్వారా మరో 9వేల కోట్లను ఆ రాష్ట్రం కోల్పోయింది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో! త్వరలో ఎన్నికలు జరగనున్నఈ రాష్ట్రంలో ఈ తరహా రాజకీయ కక్ష సాధింపు చర్యలు పతాక స్థాయికి చేరడంతో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్? సత్యాగ్రహం చేయాల్సి వచ్చింది.
ఈ ఉద్యమంలో కేరళ ప్రజలందరూ భాగస్వాములు కావడం బీజేపీ కుత్సిత రాజకీయాలకు గుణపాఠం! అయితే, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ ఆర్థిక దిగ్బంధనంపై కాంగ్రెస్? నేతృత్వంలోని యుపిఎ పెదవి విప్పకపోవడం పచ్చి అవకాశవాదం! ఏమైనప్పటికీ ఈ తరహా ఏకపక్ష విధానాలను నరేంద్రమోడీ ప్రభుత్వం ఇప్పటికైనా విడనాడాలి. రాజ్యాంగ బద్ధమైన రాష్ట్రాల హక్కులను గౌరవించాలి. లేని పక్షంలో ఈ తరహా ఆందోళనలు మరిన్ని రాష్ట్రాల్లో చోటుచేసుకునే అవకాశం ఉంది.

## కేంద్ర ఆర్థిక శాఖ హిందీ సలహా మండలి సమావేశం

మొదటిపేజీ తరువాయి

ఉప సంచాలకురాలు శ్రీమతి సుధా వర్మ, సహాయ సంచాలకురాలు శ్రీమతి బీనా రాజ్యలక్ష్మి, హోం మంత్రిత్వ శాఖ రాజభాష విభాగ ఉప సంచాలకులు రఘువీర్ శర్మ, పలువురు పార్లమెంట్ సభ్యులు, ఆర్థిక శాఖ పరిధిలోని అన్ని విభాగాల అధికారులు, సలహా మండలి సభ్యులు విపిన్ కుమార్ (న్యూఢిల్లీ), దామోదర్ కడ్సే (మహారాష్ట్ర), నవీన్ ప్రజాపతి (పశ్చిమ బెంగాల్), యతీంద్ర కటారియా (ఉత్తర ప్రదేశ్), దయానంద్ బయార్(కర్ణాటక), హిందీ విభాగ అనువాద అధికారి ఉమేష్ పంత్, ఇన్కమ్ టాక్స్ అధికారి (ఢిల్లీ) అరవింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల హాల్ టికెట్లు విడుదల

### ఆర్ ఐఓ సురేష్ కుమార్

**నవతరం -శ్రీకాకుళం**

జిల్లాలో ఫిబ్రవరి 1 నుండి 10వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థుల జనరల్ ప్రాక్టికల్ పరీక్షల హాల్‌టికెట్లు త్వరలోనే విడుదల కానున్నట్లు ఇంటర్మీడియట్ విద్య, ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఆర్.సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను 'మనమిత్ర' వాట్సాప్ యాప్ ద్వారా సులభంగా పొందవచ్చని పేర్కొన్నారు. ఇందుకోసం విద్యార్థులు 9552300009 అనే నంబర్‌కు మెసేజ్ చేసి తమ వివరాలను నమోదు చేయడం ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ఈ సౌకర్యాన్ని విద్యార్థులందరూ వినియోగించుకోవాలని కోరారు.

## పలాస అభివృద్ధికి పెద్దపీట

### రూ. 50 లక్షల నిధులతో పూర్తయిన పనులు ప్రారంభం, త్వరలో రూ. 2 కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టనున్న ఎమ్మెల్యే గౌతు శిరీష



**నవతరం - పలాస**

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి తమ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో, బడ్డీ పోలమ్మ గుడి సమీపంలో సుమారు రూ. 50 లక్షల విలువైన అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రానున్న కాలంలో మరో రూ. 2 కోట్ల నిధులతో మరిన్ని పనులు చేపట్టనున్నట్లు ప్రకటించారు.
ప్రారంభమైన మౌలిక వసతుల పనులు
మంగళవారం ఉదయం అన్నపూర్ణ ఆశ్రమం శివారు ప్రాంతంలోని బడ్డి పోలమ్మ గుడి వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌతు శిరీష, కూటమి నాయకులతో కలిసి రెండు సీసీ రోడ్లు, కాలువలు, కంచర వీధి సమీపంలో రెండు పవర్ బోర్లను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల మొత్తం విలువ సుమారు 50 లక్షల రూపాయలు. ఈ పనుల ద్వారా స్థానిక ప్రజల చిరకాల సమస్యలు తీరనున్నాయని, మెరుగైన రవాణా, తాగునీటి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆమె తెలిపారు.

### త్వరలో రూ. 2 కోట్లతో 30 రకాల పనులు

ఈ కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే, మున్సిపాలిటీ పరిధిలో త్వరలోనే సుమారు 30 రకాల అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం మున్సిపల్ నిధుల నుంచి దాదాపు రూ. 2 కోట్లు కేటాయించినట్లు ఆమె తెలియజేశారు. ఈ పనుల ద్వారా పట్టణ స్వరూపాన్ని మార్చడంతో పాటు, ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం ఈ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల సంక్షేమం పట్ల తమ కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను తెలియజేస్తున్నాయని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలను ప్రజల ముందుకు తీసుకువస్తామని ఆమె పేర్కొన్నారు.

## కళాకారుల ప్రతిభ.. భక్త ప్రహ్లాద గాథ అద్భుతం

**నవతరం -శ్రీకాకుళం**



సిక్కోలు రథసప్తమి వేడుకల్లో భాగంగా అంబేద్కర్ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం ప్రదర్శించిన 'భక్త ప్రహ్లాద' సురభి నాటకం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. సురభి శ్రీ వినాయక నాట్య మండలి కళాకారులు పౌరాణిక పాత్రల్లో ఒదిగిపోయి ప్రదర్శించిన తీరు అద్భుతంగా నిలిచింది. ముఖ్యంగా హిరణ్యకశ్యపుడి గంభీరమైన నటన, ప్రహ్లాదుడి భక్తి తత్పరత, క్లైమాక్స్ లో నరసింహ స్వామి ఆవిర్భావ ఘట్టం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కేంద్ర సంగీత్ నాటక అకాడమీ అవార్డు గ్రహీత ఆర్. వేణుగోపాలరావు ఈనాటికకు దర్శకత్వం వహించారు. మంత్రముగ్ధులను చేసే రంగురంగుల సెట్టింగులు, సాంకేతిక హంగులతో కూడిన ఈ ప్రదర్శన పాత తరం నాటక వైభవాన్ని గుర్తుకు తెచ్చింది. మంగళవారం ఇదే వేదికపై 'భూకైలాస్' నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## సేవల్లో వేగం పెంచాలి..

### రెవెన్యూ, ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సుదీర్ఘ సమీక్ష

**నవతరం -శ్రీకాకుళం**




ప్రజలకు అందించే సేవలలో జవాబుదారీతనం ఉండాలని, నిర్దేశించుకున్న లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లాలోని అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.
ప్రభుత్వ ప్రాధాన్యత రంగాల్లో పురోగతిని సమీక్షిస్తూ, క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా రెవెన్యూ అంశాలపై ఆయన గట్టిగా స్పందిస్తూ, పట్టాదారు పాస్ పుస్తకాలు, అడంగల్, వన్-బి వంటి సేవల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం జరగకూడదని ఆదేశించారు.
రెవెన్యూ క్లినిక్‌ల నిర్వహణ, భూ రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూ సంబంధిత ఫిర్యాదులను మండలాల వారీగా సమీక్షించిన ఆయన, వచ్చే సమావేశం నాటికి పెండింగ్ దరఖాస్తులన్నీ పరిష్కారం కావాలని, జీరో ఎక్స్టెంట్ ఖాతాల సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.
జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా సాగుతోందని కలెక్టర్ వెల్లడించారు. రైతులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా చూడాలని, సకాలంలో చెల్లింపులు జరిగేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. విజనరీ యూనిట్లలో బయోమెట్రిక్ హాజరు 100% ఉండాలని, పౌర సేవల్లో ఈ-కేవైసీ పెండింగ్‌లు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. 'వాట్సాప్ మిత్ర' ద్వారా అందుతున్న సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి మండలంలో ఒక 'మోడల్ విలేజ్' ఎంపిక చేసి ఆదర్శంగా తీర్చిదిద్దాలని, అలాగే సీజనల్ వ్యాధుల నివారణకు ఆసుపత్రుల్లో మందుల నిల్వలు సిద్ధంగా ఉంచాలని, క్లోరినేషన్ ప్రక్రియను పక్కాగా అమలు చేయాలని పేర్కొన్నారు.
విధుల్లో అలసత్వం వహించే వారిని సహించేది లేదని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని కలెక్టర్ హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, ఆర్డీవోలు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఆకాశ వీధిలోవిహారం..

- ఆదిత్యుని చెంత హాట్ ఎయిర్ బెలూన్ సందడి!
- 80 అడుగుల రోడ్డులో ప్రారంభం.. పర్యాటకులకు సరికొత్త అనుభూతి

**నవతరం -శ్రీకాకుళం**

సిక్కోలు రథసప్తమి ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం పర్యాటకుల కోసం సరికొత్త వినోదాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. నగరంలోని 80 అడుగుల రోడ్డు వేదికగా 'హాట్ ఎయిర్ బెలూన్' ప్రయాణాన్ని ప్రారంభించారు. అరకు చెందిన మెగా ఈగల్ ఫ్లై సంస్థ ఆధ్వర్యంలో ఈ విహార కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రెండు హాట్ ఎయిర్ బెలూన్‌లో ఎనిమిది మంది విహరించేలా ఏర్పాట్లు చేశారు. దీనికి సంబంధించి ఒక్కొక్కరికి టికెట్ ధరగా రూ.999లు నిర్ణయించారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు, అలాగే సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ బెలూన్ విహారం అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. పర్యాటకుల భద్రత దృష్ట్యా అక్కడ అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది, అంబులెన్స్ సౌకర్యాలను సిద్ధంగా ఉంచారు.



భూమి నుంచి 200 అడుగుల ఎత్తున ఆకాశం నుంచి అరసవల్లి ఆలయ శోభను, నగర అందాలను వీక్షించేందుకు నగరవాసులు, భక్తులు ఆసక్తి చూపుతున్నారు.

# మానవజాతికి మార్గదర్శకుడు..!



నిన్ను బలహీనపరచేది
నిన్నటి నీ అనుభవం
కాదు
దాన్ని గుణపాఠంగా
మలచుకోలేని నీ
నిర్లక్ష్యమే
రేపటి అపజయానికి
అద్దం..

తీపి జ్ఞాపకం ప్రేరణైతే...
చేదు జ్ఞాపకం
హెచ్చరిక...
కాలం ఇచ్చిన రెండు
వరాలే
అవి నిన్నటి నీ
గురువులు..

నిన్న నీవు కన్న కమ్మని
కలలే
నేటి నీ సత్కర్మలై,
రేపటి నీ అఖండ
విజయానికి
సోపానాలౌతాయి..

కలలు కంటె సరిపోదు
నుదుట స్వేదబిందువులు
ముత్యాల్లా చిందితేనే
రేపు వాటికి జీవం వస్తుంది..

భయం భూతమై నిలిచిన చోట
అనుమానం పిడుగవుతుంది
బద్ధకాన్ని ఒడిసిపట్టిన వేళ
విజయం బలౌతుంది..

ధైర్యం...
సాహసం...గొడుగులైనప్పుడు
ఆత్మవిశ్వాసమే నీకు దారి దీపం...
చీకటి దారుల్లో సైతం
అది నీకు గమ్యాన్ని చూపుతుందొా

ఎర్రని ఎండల్లో
సొమ్మసిల్లినవారే
గొడుగు విలువ
తెలుసుకుంటారు...
ఉక్కు సంకల్పంతో
ఉద్యమించినవారే
ఉన్నత శిఖరాలను
చేరుకుంటారు..

ఈరోజు పోరాడిన
వీరుడే...
ధైర్యంగా నిలిచిన
ధీరుడే...
మానవీయ విలువలు
గలవాడే...
సాహసమే ఊపిరిగా
సాగేవాడే...
రేపు మానవజాతికి
మార్గదర్శకుడు..



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# షట్టర్స్ బాగు చేయించాలి

- పాలకొండ వరకు ఆరుతడి పంటలకు సాగునీరందించాలి
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం విజ్ఞప్తి



**నవతరం -పాలకొండ**

తోటపల్లి పాత బ్యారేజ్ కుడి, ఎడమ కాలువల షట్టర్లు బాగుచేయించాలని, పాలకొండ వరకు ఆరుతడి పంటలకు సాగునీరందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసింది. పాలకొండ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల సమితి ప్రతినిధులతో జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన తోటపల్లి బ్యారేజ్ వద్దనున్న పాత కుడి ఎడమ కాలువల షెటర్స్ బాగు చేయించాలని, వేసవి దాహార్తి తీర్చడంతోపాటు, ఆరుతడి పంటలకు పాలకొండ మండలం శివారు ఆయకట్టు వరకు సాగునీరు విడుదల చేయాలని, పెండింగ్‌లోనున్న జంపరకోట ప్రాజెక్టు రిజర్వాయర్ పనులు పూర్తిచేసేందుకు కావలసిన నిధులను మంజూరు చేయాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌లో తయారైన ధాన్యం పండగ ముందు నుంచి నూర్పులు చేసినప్పటికీ మిల్లర్స్‌కు టార్గెట్స్ లేకపోవడంతో రైతుల కళ్లాల్లో ధాన్యం నిల్వలు మూలుగుతున్నాయని, దూరాన ఉన్న మిల్లులకు ధాన్యాన్ని రైతులు తరలించాలని చెప్పడంతో రవాణా చార్జీలు అధికం కావడంతో రైతులకు భారంగామారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగానున్న పాలకొండ ప్రాంతంలోని మిల్లర్లకు టార్గెట్స్‌తో సంబంధం లేకుండా, లేకుంటే టార్గెట్‌ను పెంచయినా ధాన్యం సేకరణకు అనుమతి మంజూరుచేయాలని విజ్ఞప్తి చేశారు. ఇదే సందర్భంలో వెలగవాడ పంచాయతీలోని మల్లిగెడ్డ ఆనకట్ట పరిధిలో సుమారు 600 ఎకరాలుకు సాగునీరు రెండు పంటలకు అందలేదని, రాతి కట్టు దెబ్బతినడంతో అందాల్సిన సాగునీరందక ఆయకట్టు రైతులు ఇబ్బంది పాలవుతున్నారని, ఆయకట్టు సంఘం అధ్యక్షుడు సీమల కాంతారావు, అల్లు కోటేశ్వరారావు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పాలకొండ మండలం గ్రామానికి చెందిన రైతులు సోమవారం సాయంత్రం సీతంపేట మండలం చిన్నబగ్గ లోని రైస్ మిల్లులకు ధాన్యాన్ని స్థానిక ఆర్‌ఎస్‌కే ద్వారా పంపించగా, మిల్లరు రైతులను రప్పించి అదనంగా ధాన్యం ఎనిమిది కేజీలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఆ గ్రామానికి చెందిన రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై జేసీ సీతంపేట తహసీల్దార్‌కు ఫోన్ చేసి మాట్లాడి, సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.
వినతిపత్రం అందజేసినవారిలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వావిలపల్లి రమణ, ద్వారపూడి అప్పలనాయుడు, పిట్ట రమణ, ఎల్‌ఎల్ పురం గ్రామ సర్పంచ్ ద్వారపూడి కుమార్, లావేటి సూర్యనారాయణ తదితరులున్నారు.

# శ్రీ విజయ వేంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీ కేసు ఛేదన

మొదటిపేజీ తరువాయి

పోలీస్ స్టేషన్ మరియు మన్యం జిల్లా బత్తిలి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మొత్తం నాలుగు కేసులను విజయవంతంగా ఛేదించి, ఆయా కేసులకు సంబంధించిన కేసు ప్రాపర్టీని పూర్తిస్థాయిలో రికవరీ చేసినట్లు తెలిపారు.ప్రతిభకు ప్రశంస:జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి,ఐపీఎస్ మార్గదర్శకత్వంలో కాశీబుగ్గ సబ్ డివిజన్ పోలీస్ అధికారి షేక్ సహాబాజ్ అహ్మద్, కాశీబుగ్గ ఇన్స్పెక్టర్ రామకృష్ణ కేసును సమర్థవంతంగా ఛేదించి ప్రతిభ కనబరిచారని కొనియాడారు. ఈ కేసులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. భద్రతపై సూచనలు:ఆలయాల వద్ద భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ప్రార్థనా మందిరాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, విలువైన వస్తువులను సురక్షితంగా భద్రపరచాలని జిల్లా ఎస్పీ మహేశ్వర రెడ్డి సూచించారు. డీవీ ఆర్ బాక్స్‌ను బలమైన గదిలో ఏర్పాటు చేసి, మొబైల్ ఫోన్‌లకు అనుసంధానం చేసే విధంగా భద్రతా చర్యలు తీసుకోవాలని ఆలయ నిర్వాహకులకు మీడియా ద్వారా జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.ఈ పత్రిక సమావేశంలో జిల్లా ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ కేవీ రమణ, కాశీబుగ్గ డిఎస్పి షేక్ సాహబాజ్ ఆహమ్మద్,ఇన్స్పెక్టర్లు ఇమాన్యుల్ రాజు,రామకృష్ణ, ఎస్సై నరసింహమూర్తి పోలీస్ సిబ్బంది ఉన్నారు.



# గుంటూరు కారం హీరోయిన్లు మళ్లీ కలిసారు

మహేష్ బాబు హీరోగా నటించిన గుంటూరు కారం సినిమాలో శ్రీలీల, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటించారు. ఆ సినిమాలో శ్రీలీల మెయిన్ హీరోయిన్ గా కనిపించగా, మీనాక్షి చౌదరి సెకండ్ హీరోయిన్ గా చేసింది. మీనాక్షికి పెద్దగా స్కోప్ లేదు అందులో.
ఇప్పుడీ ఇద్దరు హీరోయిన్లు మరోసారి కలిసి సినిమా చేయబోతున్నారు. ఈసారి మాత్రం మీనాక్షికి మంచి పాత్ర దక్కింది.
తమిళ నటుడు ప్రదీప్ రంగనాథన్, త్వరలోనే ఓ సినిమాను పట్టాలపైకి తీసుకురాబోతున్నాడు. ఇందులో హీరోయిన్లుగా మీనాక్షి చౌదరి, శ్రీలీల ఎంపికయ్యారు. సినిమాలో ఇద్దరికీ సమాన ప్రాధాన్యమున్న పాత్రలు దక్కాయి.
రీసెంట్ గా కోలీవుడ్ లో అడుగుపెట్టింది శ్రీలీల. ఆమె నటించిన పరాశక్తి సినిమా తాజాగా థియేటర్లలోకి వచ్చింది. అయితే ఆ సినిమా ఫ్లాప్. ఆమె కంటే ముందే తమిళ్ లో సినిమాలు చేసింది మీనాక్షి చౌదరి.
ఆ తర్వాత తెలుగు నుంచి వరుసగా అవకాశాలు రావడంతో, కోలీవుడ్ కు కాస్త గ్యాప్ ఇచ్చింది. కొత్త ఏడాదిలో తెలుగుతో పాటు తమిళ సినిమాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటోంది. ఇందులో భాగంగా ప్రదీప్ రంగనాథన్ సినిమాకు ఓకే చెప్పింది. మీనాక్షి సంగతి పక్కనపెడితే, శ్రీలీలకు కనీసం ప్రదీపైనా సక్సెస్ ఇస్తాడేమో చూడాలి.

# విశ్వంభర.. స్వయంభు.. ఎక్స్ట్రా..!


జనాలు దాదాపుగా మరిచిపోతున్న రెండు భారీ విఎఫఎక్స్ సినిమాలు విశ్వంభర.. స్వయంభు. ఈ రెండూ ఎప్పుడు వస్తాయో క్లారిటీ లేదు. అలా అని చిన్న చితక సినిమాలు కాదు. మెగాస్టార్ మీద 200 కోట్లకు పైగా ఖర్చు చేసిన సినిమా ఒకటి. నిఖిల్ లాంటి రీజనబుల్ హీరో మీద 70 కోట్లకు పైగా ఖర్చు చేసిన సినిమా మరొకటి.





రెండూ సోషియో ఫాంటసీ టచ్ సినిమాలే. విఎఫఎక్స్ విపరీతంగా వాడిన సినిమాలే. కొన్నాళ్ల క్రితం వరకు ఈ రెండు సినిమాల మీద విపరీతంగా ఆసక్తి వుండేది. కానీ ఇప్పుడు ఏవేవో సినిమాలు డేట్ లు వస్తున్నాయి. హైప్ వస్తోంది. కానీ ఈ రెండు సినిమాలను జనం మరిచిపోతున్నారు.
సినిమాల విడుదల డేట్ వస్తే మళ్లీ హైప్ వస్తుందేమో తెలియదు కానీ, ప్రస్తుతానికి అయితే అలా వున్నాయి ఆ సినిమాలు.
అన్ని సినిమాలు డేట్ లు లాక్ చేస్తున్నాయి. విశ్వంభర ఎందుకు లాక్ చేయడం లేదో తెలియదు. శంకర ప్రసాద్ సినిమా ఇంత పెద్ద హిట్ అయింది కనుక దాని ప్రభావం విశ్వంభర మార్కెటింగ్ మీద కచ్చితంగా వుంటుంది. అయితే ఇప్పటి నుంచి సరైన డేట్ అనౌన్స్ చేసి, హైప్ పెంచుకుంటూ వెళ్లాలి. కంటెంట్ ను పరిచయం చేయాలి. పబ్లిసిటీ ప్లానింగ్ జరగాలి. కానీ యువి సంస్థ ఈ విషయంలో కాస్త వీక్. ఏం చేస్తుందో మరి.
థియేటర్ అమ్మకాలు జరిగాయి. అయినా డేట్ కుదరడం లేదు. స్వయంభు నాన్ థియేటర్ అమ్మకాలు జరగ లేదు. ఈ దిశగా ప్రయత్నాలు జరుగుతూనే వున్నాయి. బడ్జెట్ చాలా ఎక్కువ అయింది. నాన్ థియేటర్ అమ్మకాలు పడిపోయాయి. నిఖిల్ థియేటర్ మార్కెట్ మరీ ఎక్కువ లేదు. ఇలాంటి టైమ్ లో నాన్ థియేటర్ అమ్మకాలు జరగకుండా స్వయంభు డేట్ పడదు. థియేటర్ లోకి రాదు.
మొత్తం మీద రెండు మంచి ప్రామిసింగ్ సినిమాలు అలా అబేయన్స్ లో వున్నాయి.

# 105 మందికి కంటి పరీక్షలు




**నవతరం-సంతబొమ్మాలి**

సంతబొమ్మాలి మండలం బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ శ్రీకాకుళం వారి సౌజన్యంతో పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో ఆప్తాలమిక్ అధికారి ఎం ఆర్ కె దాస్, పుష్పగిరి కంటి ఆసుపత్రి నేత్ర వైద్య సహాయకులు పి కోమలి 105 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 25 మందికి కేటరాక్ట్ శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. వీరిని శస్త్ర చికిత్సలు కొరకు విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. టి చిరంజీవి నాయుడు మాట్లాడుతూ వయోవృద్ధులందరూ తప్పనిసరిగా కంటి పరీక్షలు చేసుకోవాలని దాని వలన వారు శాశ్వత అంధత్వానికి గురికాకుండా మెరుగైన కంటి చూపుతో జీవించవచ్చు అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుస్కల లక్ష్మీకాంతం లక్ష్మయ్య ,ఎంపీటీసీ చింతాడ చిన్నారావు,టిడిపి నాయకులు వజ్జ ప్రభాకరరావు ,అప్పిన వెంకటేష్, వల్లభ వసంతరావు ,క్యాంప్ కోఆర్డినేటర్ ఎం సత్యనారాయణ , గ్రామ కార్యదర్శి బి రమేష్, ఆరోగ్య కార్యకర్త పి రేవతి ,ఎమ్ ఎల్ హెచ్ పి లు,ఆశా కార్యకర్తలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# రక్తకొరతకు కళ్లెం వేయాల్సిన సమయమిది

- జిల్లా కలెక్టర్ ఆదేశాలనుసారం అవగాహన కల్పిస్తున్నాం
- రెడ్ క్రాస్ చైర్మన్ జగన్ మోహన రావు




**నవతరం-శ్రీకాకుళం**

రక్తకొరతకు కళ్లెం వేయాల్సిన సమయమిదని, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలనుసారం జిల్లాలో అన్ని కళాశాలలో యువతకు, బహిరంగ ప్రదేశాలలో ప్రజలకు, రక్తధాన ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నామని, శ్రీకాకుళంరెడ్ క్రాస్ చైర్మన్ పి. జగన్ మోహన రావు అన్నారు. శ్రీకాకుళం స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యాశాలలో అత్యవసర పరిస్థితులలో ప్రసూతి నిమిత్తం ఎం.శ్రీదేవి చేరగా, ఆమెకు అరుదైనా ఏ నెగెటివ్ రక్త నమూనాగల రక్తం అవసరమైంది. బాధిత కుటుంబ సభ్యులు రెడ్ క్రాస్ ని సంప్రదించగా, చైర్మన్ సూచనలతో నంది. ఉమా శంకర్ తన మిత్రులైన ధర్మవరం గ్రామానికి చెందిన జి.పోతాయ్యకు, బాధితురాల బాధను వివరించాగా, స్పందించిన ఆయన వెనువెంటనే తన రక్తపుబొట్టుతో ఆమెకు ప్రాణధాత్తలయ్యారు. అనంతరం రెడ్ క్రాస్ చైర్మన్ జగన్మోహన్ రావు, నేటి ప్రాణధాతకు బంగారుపతకంతోపాటు, ప్రశంసాపత్రాన్ని అందించి, అందరూ పోతాయ్యను స్ఫూర్తిగా తీసుకొని అత్యవసర సమయంలో రక్తధాతలుగా మారాలన్నారు. ఈ రక్తధాన సమూహంలో రెడ్ క్రాస్ ఏవో ఏ.నర్సింగరావు, టెక్నీషియన్ వెంకటేష్, రక్తనిది కేంద్ర ప్రతినిధులు కే.సత్యనారాయణ, ఎన్. ఉమా శంకర్ లు పాల్గొన్నారు.

# ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతి
- నారాయణపురం, సరియాపల్లి సచివాలయాల పరిధిలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు



**నవతరం-మందస**

ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మందస, హరిపురం పశు వైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతి సూచించారు.
మందస, హరిపురం పశువైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతి ఆధ్వర్యంలో మండలంలోని సరియాపల్లి, నారాయణపురం సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెండు సచివాలయాల పరిధి గ్రావల్లో పశువులకు వ్యాధినిరోధక టీకాలు వేయడంతోపాటు, దూడలకు అంతర పరాన్న జీవులు మందులు తాగించారు.
పాడి రైతులు పశు పోషణలో తీసుకోవాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులు, పశుభీమా, పశు గ్రాసం సాగు తదితర అంశాలపై వివరించారు.
ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతినిధి కేశవరావు, సెక్రటరీ కూర్మారావు, బొంగు దామోదర, మల్లేన జనార్ధన, సివంగి మురళి, సివంగి వాసు, మడియా ధర్మారావు, గొరకల వెంకటరావు, మల్లేన దుర్యోధన, ఇతర పాడి రైతులతో పాటు సిబ్బంది ధర్మేంద్ర, ప్రసన్న, రవి, కళ్యాణ్, ఇంతియాజ్, మురళి, నిత్యానందం, పార్వతి, రాజ్యలక్ష్మి, ఉమా, మాసయ్య, సురేష్, విజయానంద్, శ్రావణి, ఎంఏవీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# కేన్సర్ బాధితురాలికి అండగా సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి



**నవతరం-పొలాకి**

శ్రీకాకుళం జిల్లా, పొలాకి మండలం, రేవుఅంపలాం గ్రామానికి చెందిన, చొడిపల్లి. రమణమ్మ స్త్రీల సంబంధిత క్యాన్సర్ తో బాధపడుతున్నారు. ప్రస్తుతం 4వ స్టేజ్ లో ఉన్న ఆమె, నిరుపేద కుటుంబంకావడంతో ఈమె కుమారుడు వలస కూలీగా ఇతర రాష్ట్రలలో పనిచేసేవారని, ఇప్పుడు ఈమెకు చూసే నాధుడు లేక, గత ఐదు నెలల నుంచి తల్లిని చూసుకుంటూ, తన గ్రామంలోనే ఉంటూ, తల్లి సేవలకే పరిమితమాయ్యారని గ్రామస్థులు తెలిపారు. మందులకు, కీమోథెరపీ చేసుకోవడానికి చాలా ఖర్చు అయిందని, ఇప్పుడు తినడానికి, మందులు కొనడానికి ఇబ్బంది పడుతున్నామని కుమారుడు తెలపగా, అంది వచ్చే కొడుకు ఉన్న నిరుపయోగం అయ్యారని, గ్రామస్థులు బాధపడుతూ సహాయం కోసం సిక్కోలు స్వచ్ఛంధ సేవా సమితి సంస్థని సంప్రదించారు. స్పందించిన సంస్థ సభ్యులు, నిత్యవసర సరుకులతోపాటుగా, 5 వేల రూపాయిల నగధుని మంగళవారం కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు రేవాడ త్రినాధరావు మాస్టారు, డాక్టర్. బ్రహ్మం, గణేష్ మాస్టర్, రఘు, రవి, ఉసికొండ.గణేష్, సిహెచ్ .రామారావు, వి.సంతోష్, బి.అనంత రాజశేఖర్రా, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో

# ఆళ్వార్ దాస్ వర్ధంతి




**నవతరం-శ్రీకాకుళం**

ఆరోగ్య ప్రదాతగా నడవండి.. నడిపించండి.. సమ సమాజ స్థాపనకు నాంది పలకండి ..అంటూ నినాదాలు చేసి.. వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థను స్థాపించిన స్వర్గీయ సుంకరి ఆళ్వార్ దాస్ 23వ వర్ధంతి కార్యక్రమం మంగళవారం శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆళ్వార్ దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు మాట్లాడుతూ, నడక ఉద్యమ సారధి ఆళ్వార్ దాస్ స్థాపించిన వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ నేడు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిందని, వ్యక్తిగత ఆరోగ్యంతోపాటు, సామాజిక సేవా కార్యక్రమాల్లో మిగిలిన స్వచ్ఛంద సంస్థలకు ధీటుగా పనిచేస్తుందన్నారు. నిత్యం వాకింగ్, యోగా, ఇతర వ్యాయామాలు చేసిన వారికి అనారోగ్యం దరిచేరదని అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయని, దీన్ని గ్రహించి ప్రతిఒక్కరూ విధిగా వాకింగ్ విధిగా చేయాలని వారు కోరారు.. ఈ సందర్భంగా స్వర్గీయ ఆళ్వార్దాశ్ సమాజానికి అందించే సేవలు వక్తలంతా కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల లక్ష్మి. వావిలపల్లి జగన్నాథనాయుడు, బీసీ సంఘాల నేత గద్దిబోయిన కృష్ణారావు , సుగంధం సంజీవ రావు, ఐకే రావు. డి. కృష్ణారావు, నాళ్ళబాటి కృష్ణమూర్తి, గుడ్ల గోపాలరావు, పొట్నూరు నాగేశ్వర రావు, పట్నాన రామారావు, నారంశెట్టి కృష్టారావు, మెట్ట ధనుంజభట్లు, స్టార్ వనితా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జ్యోతి, మెట్ట కళావతి, వినీల, రామ్ బాయి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అంతకన్నా ముందు శ్రీకాకుళం నగరంలో ఆళ్వార్ దాస్ అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు..

## డాక్టరేట్ సాధించిన ఐతం అధ్యాపకులు

# గోపాలకృష్ణ వాకముళ్ళు

**నవతరం టెక్కలి**



ఆదిత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ (ఐతం) ఇంజినీరింగ్ కళాశాల బిజినెస్ మేనేజ్మెంట్ విభాగంలో బోధనా విధులు నిర్వహిస్తున్న గోపాలకృష్ణ వాకుముళ్ళు డాక్టరేట్ సాధించారు. అని, గ్రామీణ వినియోగదారుల ఆన్లైన్ కొనుగోలు ప్రవర్తనపై విభాగాల ప్రభావాన్ని విశ్లేషిస్తూ "నార్త్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలోని ఎంపిక చేసిన ఉత్పత్తులపై గ్రామీణ వినియోగదారుల ఆన్లైన్ షాపింగ్ ప్రవర్తన –ఒక అనుభవాత్మక అధ్యయనం" అనే అంశంపై ఆయన బెర?హాంపూర్ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరావు తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్తో పాటు ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్. శ్రీనివాసరావు, విభాగాధిపతులు, తోటి అధ్యాపకులు గోపాలకృష్ణ వాకుముళ్ళును అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**